నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, మంగళవారం 8 అక్టోబర్ 2024 | VIKARABAD

బతుకమ్మ, దసరా రాష్ట్రంలోనే పెద్ద పండుగలు. ప్రజలంతా ఒక్కచోట చేరి చేసుకునే వేడుకలు. కేసీఆర్ హయాంలో ప్రతి పల్లె, పట్టణంలో పది రోజుల ముందునుంచే ఫెస్టివల్ సంబురం కనబడగా.. కాంగ్రెస్ హయాంలో ఆనాటి వైభవం కనబడడం లేదు. గ్రామ పంచాయతీలకు అరకొరగా విడుదల చేస్తున్న నిధులతో బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు చేయడం ఎలా? అని అధికారులు సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఏటా ఇచ్చే చీర కానుకను సైతం ప్రస్తుత ప్రభుత్వం ఎగ్గొట్టింది. ఇస్తామన్న రూ. 500 ఇవ్వకపోవడంతో మహిళలు నిరుత్సాహపడుతున్నారు. సర్కారు తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

-రంగారెడ్డి, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ)

నాటి వైభవమేది..?

బతుకమ్మ పండుగపై కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు

- కానరాని కానుకలు.. అందని డబ్బులు
- గత కేసీఆర్ హయాంలో ఆడంబరంగా ఉత్సవాలు.. పది రోజుల ముందు నుంచే పండుగ సంబురం
- నేడు కనీస ఏర్పాట్లు లేక డీలాపడుతున్న మహిళలు
- కాంగ్రెస్ సర్కారుపై అసంతృప్తిలో ఆడపడుచులు

పంచాయతీలకు కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా రావడం లేదు. రాష్ట్రం ప్రతినెలా అందించాల్సిన ఆర్థిక సంఘం నిధులూ మూడు నెలలకు ఓసారి అంతంత మాత్రంగానే వస్తున్నాయి. మేజర్ పంచాయతీలకు స్థానిక వనరుల ద్వారా ఆదాయం వస్తుండడంతో వివిధ ఖర్చులకు ఆ నిధులను సర్దుబాటు చేస్తున్నారు. చిన్న పంచాయతీలకు ఆదాయ వనరులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి మరీ అవసరాలు తీరుస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న అరకొర నిధులతో సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్ల కిస్తీలు, మోటర్ల మరమ్మతు, బ్లీచింగ్ పౌడర్, వీధి దీపాల మరమ్మతులు వంటి వాటికి వెచ్చిస్తున్నారు. ఏవైనా సమావేశాలు జరిగినప్పుడు టెంట్ హౌస్‌లు, ఎలక్ట్రిక్ బల్బులతోపాటు చిన్న చిన్న వస్తువులన్నింటికీ సగం చెల్లించి మిగతాది ఉద్దెరకు తెస్తున్నారు. ఇటీవల జిల్లాలోని 558 పంచాయతీలకు ముష్టిగా ప్రభుత్వం రూ.7.48 కోట్లను విడుదల చేయగా ..అవి ఏమూలకు సరిపోవని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విడుదలైన ఆ కాస్త..నిధులు కూడా పాత అప్పులకే సరిపోయాయంటున్నారు. ప్రస్తుతం జ్వరాలు విజృంభిస్తున్న క్రమంలో బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ వేసేందుకే డబ్బులు లేకపోగా.. ఇప్పుడు దసరా పండుగకు ఏర్పాట్లు చేయడం తలకు మించిన భారమవుతున్నదని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

కానరాని పండుగ ఏర్పాట్లు ..

కేసీఆర్ హయాంలో బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహించారు. ఊరూరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేశారు. ఆ నిధులతో వీధిలైట్ల ఏర్పాటుతోపాటు బతుకమ్మ ఆడే స్థలాలు, నిమజ్జనం చేసే ప్రాంతాల చదును, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేయడం వంటి పనులను చేపట్టేవారు. దసరాకు పది రోజుల ముందు నుంచే వాడవాడలు సందడితో కనిపించేవి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జరుగుతున్న తొలి పండుగను గతంలో మాదిరిగానే ఆడంబరంగా నిర్వహిస్తారని ఆనుకున్న ప్రజలకు నిరాశే ఎదురవుతున్నది. బతుకమ్మ ఆటస్థలాల వద్ద ఏర్పాట్లపైనా ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కనీసం సద్దుల బతుకమ్మకైనా ప్రభుత్వం ఘనంగా ఏర్పాట్లు చేస్తుందేమో! అనుకుంటే.. అందుకు సంబంధించిన ఏర్పాట్ల కోసం ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని క్షేత్రస్థాయిలో అధికారులు సెలవిస్తున్నారు. ఈ ఏడాది తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ కళ తప్పిందని ఆడపడుచు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

బతుకమ్మ ఆడుతున్న మహిళలు (ఫైల్)

సర్కారు చిన్నచూపు చూస్తున్నది..

గతంలో కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ పండుగ సంబురంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను చిన్నచూపు చూస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం ఏటా కానుకలను అందించి మహిళలను గుర్తించింది. కానీ కాంగ్రెస్ సర్కారు ఇప్పటివరకు ఎలాంటి కానుకలు అందించలేదు. గ్రామాల్లో బతుకమ్మలు నిమజ్జనం చేసే చెరువుల వద్ద కూడా కనీస ఏర్పాట్లు చేయకపోవడం బాధాకరం.

-చెరుకూరి మంగ, పోల్కంపల్లి, ఇబ్రహీంపట్నం రూరల్

సందడి కనిపించడం లేదు..

కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ పండుగకు అధిక ప్రాధాన్యమిచ్చేది. ఈ పండుగకు పది రోజుల ముందు నుంచే గ్రామాల్లో సందడి కనిపించేది. వీధి దీపాల ఏర్పాటు ముందుగానే జరిగేవి. ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కడ కూడా సందడి కనిపించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను పట్టించుకోకపోవ డం సరికాదు.

బోరాంచ రమ్య,
మాజీ సర్పంచ్
సోలీపేట, షాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వానికి కల్చర్ తెలియదు..

కాంగ్రెస్ ప్రభుత్వానికి కల్చరే తెలియదు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాల పట్ల ఏ మాత్రం అవగాహన ఉన్నా బతుకమ్మ పండుగకు అధిక ప్రాధాన్యమిచ్చేది. కేసీఆర్ హయాంలో ప్రతి పల్లె, పట్టణంలో పది రోజుల ముందు నుంచే సంబురం కనిపించేది. కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎంకు మహిళల పట్ల గౌరవం లేదు కాబట్టే బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహించడంలేదు.

-జే స్వప్న, బీఆర్ఎస్ పార్టీ
మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు

కేసీఆర్ హయాంలో ఘనంగా ఉత్సవాలు

కేసీఆర్ హయాంలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆయన ఆడబిడ్డలకు పెద్దన్నలాగా ఉండి ప్రతి ఏటా బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఇప్పటి ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లు చేయడంలేదు. బతుకమ్మ చీరలనూ పంపిణీ చేయలేదు.

-కొమ్ము జెల్లమ్మ, గుర్రంగుట్టకాలనీ, ఆమనగల్లు మున్సిపాలిటీ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

సీఎంను చేసినందుకు

రైతుల నోట్లో మట్టి..

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- ఫార్మా కంపెనీల రద్దు, షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని రేపు పోలేపల్లి నుంచి దుద్యాల వరకు పాదయాత్ర

బొంరాస్‌పేట, అక్టోబర్ 7 : రైతులు, ప్రజలను మభ్యపెట్టి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, ప్రజలు ఓట్లేసి గెలిపించి సీఎంను చేస్తే ఇక్కడి రైతుల నోట్లో మట్టికొట్టేలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం దుద్యాల మండలంలోని గౌరారంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం గత ప్రభుత్వం మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో 14 వేల ఎకరాల భూమిని సేకరించి జీవో కూడా జారీ చేసిందని, భూమి సిద్ధంగా ఉన్నా అక్కడ వాటిని ఏర్పాటు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గానికి తరలిస్తున్నారని ఆరోపించారు. దుద్యాల మండలంలో రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఫార్మా కంపెనీల ఏర్పాటు పేరిట తీసుకునే ప్రయత్నం చేస్తూ ఇప్పటికే 1400 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్‌నూ జారీ చేసిందన్నారు. ఫార్మా కంపెనీల ఏర్పాటును వ్యతిరేకిస్తూ, సీఎం రేవంత్‌రెడ్డి బుద్ధి మారాలని ఈ నెల 9న ఉదయం 7 గంటలకు దుద్యాల మండలంలోని పోలేపల్లి నుంచి దుద్యాల తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర చేయనున్నట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు. అక్కడ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు.

ఆగస్టు 15లోగా రైతులందరికీ ఎలాంటి షరతుల్లేకుండా రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, వాస్తవంగా ఎక్కడ చూసినా 30 శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదని ఆయన మండిపడ్డారు. కొడంగల్ నియోజకవర్గంలోని రైతులందరి రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫార్మా రద్దు, సంపూర్ణ రుణమాఫీ డిమాండ్లతో చేపట్టే పాదయాత్రలో తనతోపాటు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొనను న్నారని, ఫార్మా బాధిత గ్రామాల రైతులు, ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఫార్మా కంపెనీల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే భవిష్యత్తులో ఆందోళనలను ఉధృతం చేస్తామని, కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపడతామని నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ దుద్యాల, బొంరాస్‌పేట మండలాల అధ్యక్షులు చాంద్ పాషా, యాదగిరి, దౌల్తాబాద్ మాజీ జడ్పీటీసీ మహిపాల్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, బీఆర్ఎస్ దుద్యాల మండల యూత్ అధ్యక్షుడు సురేశ్‌రాజ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో అంధకారం

- వెలుగని వీధి దీపాలు.. జనానికి ఇక్కట్లు..
- నిర్వహణ తీరు బాగోలేదంటూ ఈఈఎస్ఎల్‌పై కమిషనర్ ఆగ్రహం

సిటీబ్యూరో : వెలుగని వీధి దీపాలతో భాగ్యనగరంలోని పలు ప్రాంతాల్లో చీకట్లు అలుముకున్నాయి. ఐదు లక్షలకు పైగా ఉన్న వీధి దీపాల్లో దాదాపు 35 శాతానికిపైగా పనిచేయడం లేదు. ఇటీవల తరచూ స్ట్రీట్‌లైట్లు వెలుగక ఇబ్బందులు పడుతున్నామంటూ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. దీనిపై దృష్టి సారించిన కమిషనర్ ఆమ్రపాలి సదరు నిర్వహణ బాధ్యతలు చూసే ఈఈఎస్ఎల్ ఏజెన్సీ ఏ మాత్రం పనితీరు మెరుగుపర్చుకోవడంలేదని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సదరు ఏజెన్సీ పనితీరులో మార్పు రాకపోవడంతో ఏకంగా రూ.80కోట్ల పెండింగ్ బిల్లుల చెల్లింపులను కమిషనర్ నిలిపివేశారు. దీంతోపాటు కొత్తగా ఏర్పాటైన పది కాలనీల్లో వీధిదీపాలను ఏర్పాటు చేసే బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని నిర్ణయించి, ఈ మేరకు టెండర్లు పిలిచారు.

5 లక్షలకు పైగా..

గ్రేటర్‌లో సుమారు 5 లక్షలకు పైగా వీధి దీపాలను నిర్వహించే బాధ్యతలను 2018 ఏప్రిల్ నుంచి ఏడేండ్ల పాటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)కు అప్పగించిన సంగతి తెలిసిందే. వీటిలో పది శాతం స్ట్రీట్‌లైట్లు టైమర్ల సహాయంతో ఆటోమెటిక్‌గా వెలుగడం, ఆటోమెటిక్‌గా ఆఫ్ అవుతుండగా, మిగిలిన వాటిని మాన్యువల్‌గానే మెయింటేన్ చేస్తున్నారు. అయితే నిర్వహణలో ఈఈఎస్ఎల్‌పై తరచూ కార్పొరేటర్లు ఫిర్యాదులు చేస్తున్నారు. ఒకానొక దశలో గత కమిషనర్లు సైతం మందలించారు. ముఖ్యంగా వీధి దీపాల మరమ్మతులు, మార్చాల్సిన లైటు, ఇతర పరికరాలను సుమారు 15 శాతం రిజర్వ్ పెట్టుకోవాలన్న నిబంధన ఒప్పందంలో ఉన్నా దానిని ఈఈఎస్ఎల్ అమలు చేయడం లేదు. పైగా కొత్తగా పది కాలనీలకు విద్యుత్ సరఫరా మంజూరయినప్పటికీ స్తంభాలు వేసి, కరెంట్ తీగలను లాగడంతోపాటు వీధి దీపాలను బిగించాల్సిన పనులను ఈఈఎస్ఎల్ పట్టించుకోవడం లేదు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

పండుగ పూట పస్తులేనా ?

- రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టరేట్‌ల ఎదుట గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా
- తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్

రంగారెడ్డి, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ)/ వికారాబాద్: పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టరేట్ల ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు, శ్రామిక మహిళా రంగారెడ్డి జిల్లా కన్వీనర్ కవిత మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో 52వేల మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారని, ఇచ్చే అతి తక్కువ వేతనాలను నెలల తరబడిగా చెల్లించకపోవడంతో కార్మికులు అప్పులపాలై ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ తీరుతో దసరా పండుగకు పస్తులుండే దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందన్నారు. అధికారంలోకి రాగానే పంచాయతీ కార్మికుల వేతనాలను పెంచి పర్మినెంట్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిందని, ఆ పార్టీ మాటలు నమ్మి కార్మికులంతా ఓట్లేసి గెలిపించారన్నారు. పది నెలల ప్రజాపాలనలో నేటికీ మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయకపోగా..పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయడంలేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం కలెక్టర్ శశాంకకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా నాయకులు కృష్ణ, పెంటయ్య, బలరాజ్, జీపీ యూనియన్ నాయకులు జగన్, కృష్ణ, జంగయ్య, రవనీల, ఆశీర్వాదం, సాలమ్మ, ఆండాళు, లలిత, గాలయ్య, శంకరయ్య, సునీత, యాదయ్య, జంగయ్య పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

వికారాబాద్ : ప్రభుత్వం పెండింగ్ వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు పండుగ పూట పస్తులుండాల్సిన పరిస్థితి వచ్చిందని వికారాబాద్ జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు మహిపాల్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, చంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ..ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నర్సింహులు, వెంకటప్ప, బసప్ప, రాములు, అంబరప్ప, చందు, శ్యామప్ప, షబ్బీర్, లక్ష్మి, మొగులమ్మ, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట..

ఒక్కో పనికి.. ఒక్కో రేటు..

తహసీల్దార్ కార్యాలయాల్లో పైసలిస్తేనే పనులు !

రెవెన్యూ యంత్రాంగం వసూళ్ల పర్వం

- పై అధికారులకు రిపోర్టులు పంపించాలంటే అడిగినంత ఇవ్వాల్సిందే..
- లేకుంటే కొర్రీలు పెట్టి..రిజెక్టే
- వికారాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో రెవెన్యూ అధికారుల బరితెగింపు

ఇటీవల ఓ రైతు తన పేరు రికార్డుల్లో తప్పుగా నమోదు కావడంతో దానిని సరిచేసుకునేందుకు టీఎం-33లో దరఖాస్తు చేసుకున్నాడు. అనంతరం ఓ మండల కార్యాలయానికెళ్లి మీరు రిపోర్టును పై అధికారులకు త్వరగా పంపిస్తే భూసమస్య పరిష్కారం అవుతుందని చెప్పాడు. అయితే మాకు ఎకరానికి రూ.20 వేలు ఇస్తేనే రిపోర్టును కలెక్టరేట్‌కు పంపిస్తామని ఆ మండల డిప్యూటీ తహసీల్దార్ తెగేసి చెప్పడం గమనార్హం.

ఓఆర్సీ (ఆక్యుపైడ్ రైట్ సర్టిఫికెట్) కోసం ఓ రైతు ఇటీవల దరఖాస్తు చేసుకున్నాడు. నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన తర్వాత పంచనామాకు వచ్చిన ఆర్ఐ రూ.5 వేలు ఇస్తేనే రిపోర్టును రూపొందిస్తానని.. ఓఆర్సీ జారీకి ఆర్డీవోకు పంపే రిపోర్టును కూడా నేనే పంపించాల్సి ఉంటుందని.. అందుకు ఎకరానికి రూ.40 వేలు చెల్లించాల్సిందేనని చెప్పడంతో బాధితుడు షాక్ అయ్యాడు.

వికారాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): రెవెన్యూ శాఖలో సేవలను పారదర్శకంగా అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక పోర్టల్‌ను కొందరు అధికారులు దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో పనికి.. ఒక్కో రేట్ ఫిక్స్ చేసి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. పోర్టల్ ఆపరేటర్, ఆర్ఐ నుంచి తహసీల్దార్ స్థాయి వరకు ఒక్కో స్థాయిలో వాళ్లు అడిగినంత ఇస్తేనే ఫైల్ ముందుకు కదులుతుంది.. లేదంటే ఏదో ఒక కొర్రీ పెట్టి పెండింగ్‌లో పడేస్తున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భూబాధితుల నుంచి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించినా కొందరు తహసీల్దార్లు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అయితే దరఖాస్తుల పరిష్కారంలో మండల రెవెన్యూ యంత్రాంగం ఇచ్చే రిపోర్టులే కీలకం కావడంతో ఇదే అదునుగా చేసుకుని వారు అందిన కాడికి దోచుకుంటున్నారని పలువురు మండిపడుతున్నారు. అక్రమార్కులతో కుమ్మక్కై అమాయకుల భూములను ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఆరోపణలూ బలంగా ఉన్నాయి.

పంచనామాకు రూ.5 వేలు.. రిపోర్టుకు రూ.20 వేలు..

వికారాబాద్ జిల్లాలోని పలు మండలాల్లోని రెవెన్యూ యంత్రాంగం వసూళ్లకు పాల్పడుతున్నది. దరఖాస్తుల పరిష్కారంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి వెళ్లే రిపోర్టులే కీలకం కావడంతో పైసలిస్తేనే రిపోర్టులు ఇస్తామని వారు తెగేసి చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే తహసీల్దార్ నుంచి రిపోర్టును కలెక్టరేట్‌కు పంపించాలంటే క్షేత్రస్థాయిలో పంచనామా తప్పనిసరి. క్షేత్రస్థాయిలో పంచనామా చేయాలంటే రూ. ఐదు వేలు ఇవ్వాల్సిందేనని పలు మండలాల ఆర్ఐలు రేట్‌ను ఫిక్స్ చేశారనే ఆరోపణలున్నాయి. పంచనామా రిపోర్టు కలెక్టర్‌కు చేరాలంటే దానికి కూడా అదనంగా కొంత మొత్తాన్ని చెల్లిస్తేనే ఆ ఫైల్ ముందుకు కదులుతుంది. అయితే తప్పుగా ఎంట్రీ అయి కష్టాలు పడుతున్న పేద రైతులనూ రెవెన్యూ అధికారులు వదలి పెట్టడం లేదు. ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో దరఖాస్తుల పరిష్కారం వెంటనే అవుతున్నా తహసీల్దార్ కార్యాలయాల్లో మాత్రమే కావాలనే పెండింగ్‌లో పెడుతున్నారు. అయితే కలెక్టర్‌కు పంపించే రిపోర్టుకు ఎకరాకు రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఫైల్ కనపడని పరిస్థితి పలు మండలాల్లో నెలకొన్నది. ఇటీవల ఓ తహసీల్దార్ అన్ని వివరాలు సరిగ్గానే ఉన్నా నెగెటివ్ రిపోర్టును పై అధికారులకు పంపించగా.. పరిశీలించిన అదనపు కలెక్టర్ తిరిగి మళ్లీ రిపోర్టును పంపించాలని ఆ ఫైల్‌ను వెనక్కి పంపారు. ఈ విధంగా పైసలిస్తేనే పాజిటివ్ రిపోర్టులు ఇస్తూ.. లేదంటే ఏదో ఒక కొర్రీ పెడుతూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. అయితే మండల రెవెన్యూ యంత్రాంగంపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి పెట్టకపోవడంతోనే అధికారులు, సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ ప్రతీక్ జైన్ దృష్టి సారించి పేద రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.